నమస్తే తెలంగాణ
# సిద్దిపేట
I | హైదరాబాద్, మంగళవారం 17 జూన్ 2025 | SIDDIPET

## ఎమ్మెల్యే 'పల్లా' కోలుకోవాలని పూజలు



సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మల్లన్న ఆలయంలో పట్నం వేసి పూజలు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

చేర్యాల, జూన్ 16 : జనగామ నియోజకవర్గ అభివృద్ధి, ప్రజల సంక్షేమంతో పాటు పార్టీ శ్రేణులు సుఖసంతోషాలతో ఉండే విధంగా అహర్నిషలు కృషి చేస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి త్వరగా కోలుకోవాలని కోరుతూ బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ముస్త్యాల బాల్‌నర్సయ్య ఆధ్వర్యంలో పార్టీ నాయకులు,కార్యకర్తలు నిత్యం పూజలు చేస్తున్నారు.సోమవారం చేర్యాలటౌన్, చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, ధూళిమిట్ట మండలాలకు చెందిన బీఆర్ఎస్ ముఖ్య నాయకులు కొమురవెల్లి మల్లికార్జున స్వామి క్షేత్రంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. స్వామి వారి ఆలయంలోని మహామండపంలో పెద్ద పట్నం వేసి పూజలు చేశారు. ఈ సందర్భంగా పలువురు బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ ప్రజలకు అన్ని విధాలుగా అండగా ఉంటూ నియోజకవర్గ సమస్యలను అసెంబ్లీలో ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తున్న ఏకైక ప్రతిపక్ష ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ప్రజల గుండెల్లో తన స్థానాన్ని సుస్థిరం చేసుకున్నారని గుర్తుచేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ అధ్యక్షులు గీస భిక్షపతి, అనంతుల మల్లేశం, ముస్త్యాల నాగేశ్వర్‌రావు, ముఖ్య నాయకులు అంకుగారి శ్రీధర్ రెడ్డి, తలారీ కిషన్, వుల్లంపల్లి కరుణాకర్, సిలువేరు సిద్ధప్ప, సుంకరి మల్లేశంగౌడ్, పుర్య వెంకట్ రెడ్డి, పెడుతల ఎల్లారెడ్డి,శివగారి అంజయ్య, జింకల పర్వతాలుయాదవ్, ముత్యం నర్సింహులు, మలిపెద్ది మల్లేశం,నాచగొని వెంకట్‌గౌడ్, మెరుగు కృష్ణాగౌడ్, తాడెం రంజితాకృష్ణమూర్తి, మీస పార్వతి, పచ్చిమడ్ల స్వామి తదితరులు పాల్గొన్నారు.

## బస్సు కోసం రోడ్డెక్కిన విద్యార్థులు



మెదక్ జిల్లా నర్సాపూర్‌లో రోడ్డుపై బైఠాయించి ధర్నా చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

నర్సాపూర్,జూన్16: స్కూల్‌కు వెళ్లేందుకు బస్సు సదుపాయం కల్పించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు రోడ్డెక్కారు. వివరాలిలా ఉన్నాయి. మెదక్ జిల్లా నర్సాపూర్ మండలంలోని జక్కపల్లి గ్రామ సమీపంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌కు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన విద్యార్థులు వెళ్తుంటారు. నర్సాపూర్ నుంచి జక్కపల్లి మోడల్ స్కూల్ వరకు ఉదయం మూడు బస్సులు, సాయంత్రం మూడు బస్సులు నడిచేవి. కానీ ఈ విద్యాసంవత్సరం ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు ఒక్క బస్సు కూడా నడవడం లేదు. దీంతో విద్యార్థులు, తల్లిదండ్రులు సోమవారం ఉదయం నర్సాపూర్ పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా జాతీయ రహదారిపై బైఠాయించి ధర్నాకు దిగి నిరసన వ్యక్తం చేశారు. నర్సాపూర్ నుంచి జక్కపల్లి స్కూల్ వరకు బస్సు నడిపించాలని రోడ్డుపై బైఠాయించి నినాదాలు చేశారు. దీంతో చాలా సేపు రోడ్డుపై వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఈ విషయం తెలుసుకున్న ఎస్సై-2 జగన్నాథం పోలీస్ సిబ్బందితో కలిసి ఘటనాస్థలికి చేరుకొని విద్యార్థులు, తల్లిదండ్రులతో మాట్లాడారు. డిపో మేనేజర్ సురేఖతో ఎస్సై జగన్నాథం ఫోన్‌లో మాట్లాడగా మంగళవారం నుంచి బస్సు సర్వీసులు నడిపిస్తామని హామీ ఇవ్వడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ధర్నా విరమించారు.



సిద్దిపేట జిల్లా గజ్వేల్- సంగాపూర్ మార్గంలో రింగ్ రోడ్డు నిర్మాణం అసంపూర్తిగా ఉండడంతో రాంగ్‌రూట్‌లో వెళ్తున్న ప్రయాణికుడు

# రింగ్‌రోడ్డుపై నీలినీడలు

- సిద్దిపేట జిల్లా గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ చుట్టూ 23 కిలోమీటర్ల రింగ్ రోడ్డు నిర్మాణం
- అర్ధాంతరంగా నిలిచిన అభివృద్ధి
- ముందుకు సాగని పెండింగ్ పనులు
- పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వం
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు



సిద్దిపేట జిల్లా గజ్వేల్-సంగాపూర్ మార్గంలో పూర్తికాని రింగ్‌రోడ్డు పనులు

గజ్వేల్, జూన్ 16: సిద్దిపేట జిల్లా గజ్వేల్ చుట్టు ఉన్న గ్రామాలను కలుపుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రూ.230కోట్లతో రింగ్‌రోడ్డు నిర్మాణం చేపట్టారు. రింగ్ రోడ్డు నిర్మాణం పూర్తి చేసేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంతగానో కృషి చేసినా కేసుల కారణంగా పూర్తి చేయలేకపోయింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై ఏడాదిన్నర గడిచినా అర్ధాంతరంగా నిలిచిన అభివృద్ధి పనులపై దృష్టి సారించడం లేదు. సిటిజన్ క్లబ్ వద్ద రింగ్‌రోడ్డు పనులకు మోక్షం లభించడం లేదని పట్టణవాసులు వాపోతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చొరవ చూపకపోవడంతో ప్రయాణికులకు రోడ్డు సౌకర్యం అందుబాటులోకి రావడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. సిటిజన్ క్లబ్ వద్ద నిలిచిన 60మీటర్ల రింగ్ రోడ్డు పనులు పూర్తయితే ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుంది.

### అసంపూర్తిగా రింగ్‌రోడ్డు పనులు

సిద్దిపేట జిల్లా గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ చుట్టూ 23 కిలోమీటర్ల రింగ్‌రోడ్డు నిర్మాణంలో ధర్మారెడ్డిపల్లి-జాలిగామ గ్రామాల మధ్య మిగిలిన 1.6 కిలో మీటర్ల రింగ్‌రోడ్డు పనులను రైల్వేశాఖ వారు ప్రస్తుతం చేపడుతున్నారు. గజ్వేల్-సంగాపూర్ మార్గంలో సిటిజన్ క్లబ్ వద్ద అసంపూర్తిగా మిగిలిన రింగ్‌రోడ్డు పనులను పూర్తిస్థాయిలో చేపట్టేందుకు ప్రభుత్వం చొరవ చూపడం లేదు. దీంతో నేటికి రోడ్డు అసంపూర్తిగానే కనిపిస్తుంది. ఇదే మార్గంలో ప్రస్తుతం ఆర్‌అండ్‌ఆర్ కాలనీ గ్రామాలు, వర్గల్, చౌదర్‌పల్లి, మాక్త, సింగాయిపల్లి, నెంటూర్, అంబర్‌పేటతో పాటు ములుగు మండల కేంద్రానికి వెళ్లే ప్రయాణికులు అసంపూర్తిగా ఉన్న రోడ్డుతో తరచూ ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలు వస్తే గుంతల్లో నీళ్లు చేరడంతో ద్విచక్రవాహనదారులు వాటిలో పడిపోయి ప్రమాదాలకు గురైన సంఘటనలు ఉన్నాయి. ఇక్కడ ఒక వరుస రోడ్డు పనులు పూర్తికాగా మరో వరుస మట్టిరోడ్డు కావడంతో వర్షాలతో పూర్తిగా గుంతలుగా మారింది. ఈ మట్టి రోడ్డుపై వాహనాలు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. కొందరు వాహనదారులు రాంగ్‌రూట్‌లో వెళ్లడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. పదుల సంఖ్యలో ప్రమాదాలు జరగడంతో ఇద్దరు మృతి చెందగా మరికొంత మందికి గాయాలయ్యాయి. రోడ్డు నిర్మాణం పూర్తి చేస్తే ట్రాఫిక్ సమస్య తీరడంతో ప్రమాదాలు జరగకుండా ఉంటుంది.

### పనులు పూర్తయితే తీరనున్న ట్రాఫిక్ సమస్య

గజ్వేల్-సంగాపూర్ మార్గంలో నిలిచిన రింగ్‌రోడ్డు పనులు పూర్తయితే ట్రాఫిక్ సమస్య తీరనుంది. ప్రస్తుతం చెన్నై, బెంగళూర్, నల్లగొండ, మిర్యాలగూడ, సూర్యాపేట, చిట్యాల తదితర ప్రాంతాల నుంచి ముంబాయి, పూణే, నిజామాబాద్ ప్రాంతాలకు వెళ్లే కంటైనర్లు, లారీలు శ్రీగిరిపల్లి రింగ్ నుంచి రింగ్ రోడ్డు మీదుగా వెళ్తున్నాయి. అందుకు ప్రభుత్వం వెంటనే గజ్వేల్-సంగాపూర్ మార్గంలో నిలిచిన పనులపై దృష్టి సారించి పూర్తి చేస్తే ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం లభించనుంది. రింగ్‌రోడ్డు పూర్తయితే పట్టణంలోకి భారీ కంటైనర్లు, లారీలు రాకుండా రింగ్‌రోడ్డు మార్గంలో వెళ్తే పట్టణవాసులకు ట్రాఫిక్ సమస్యతో ఉపశమనం లభించనున్నది.

# ప్రభుత్వ పాఠశాలలో నో అడ్మిషన్

- కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాల
- ఇందిరానగర్ పాఠశాలను దత్తత తీసుకున్న మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు





సిద్దిపేట పట్టణంలోని ఇందిరానగర్ పాఠశాలలో నో అడ్మిషన్ ఫ్లెక్సీ ఏర్పాటు చేసిన దృశ్యం

సిద్దిపేట అర్బన్, జూన్ 16 : ఇప్పుడు ఉన్న పరిస్థితుల్లో ఒక ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్పించాలంటే తల్లిదండ్రులు ఆలోచిస్తారు. అదే విధంగా ప్రభుత్వ పాఠశాలల్లో మీ పిల్లల్ని చేర్పించండి అంటూ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు బడిబాట చేపట్టినా చాలా మంది ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు అనాసక్తి చూపుతున్నారు. ఆ పాఠశాలలో పరిస్థితి మాత్రం పూర్తి భిన్నంగా ఉంటుంది. ఎందుకంటే ఆ పాఠశాలలో చేరేందుకు ఎంతో మంది వేచి చూస్తారు. అదే సిద్దిపేట జిల్లా సిద్దిపేట పట్టణంలోని ఇందిరానగర్ ప్రభుత్వ పాఠశాల. మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రత్యేక చొరవతో కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా పదేండ్లుగా పాఠశాల ప్రారంభంలోనే నోఅడ్మిషన్ ఫ్లెక్సీ పెడుతున్న ఇందిరానగర్ ప్రభుత్వ పాఠశాలపై ప్రత్యేక కథనం.

**స్కూల్‌ను దత్తత తీసుకున్న హరీశ్‌రావు**

ఇందిరానగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆరోతరగతి నుంచి పదోతరగతి వరకు బోధిస్తారు. ఈ పాఠశాలలో 1200కు పైగా విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. పాఠశాల ప్రారంభమై కేవలం నాలుగు రోజులకే పాఠశాలలోని అన్ని తరగతుల్లో సీట్లు నిండిపోయాయంటే ఆ పాఠశాలకు ఉన్న క్రేజ్ ఎంటో అర్థం చేసుకోవచ్చు. మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు ఈ పాఠశాలను దత్తత తీసుకొని పలు ట్రస్టులు, ఎన్జీవోల సహాయంతో పాఠశాలకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించారు. పాఠశాలలో డిజిటల్ ల్యాబ్, కంప్యూటర్ ల్యాబ్, సైన్స్ ల్యాబ్, అటల్ టింకరింగ్ ల్యాబ్, గూగుల్ ఫ్యూచర్ క్లాస్ సదుపాయం, సోలార్ పవర్ యూనిట్, మోటల్ వంటశాల, వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. ఈ పాఠశాల ప్రతి రికార్డును ఆన్‌లైన్‌లోనే నిక్షిప్తం చేసి ఉంచుతారు. ఉపాధ్యాయుల చొరవ, విద్యార్థుల ఉత్సాహంతో పాఠశాల దినాదినాభివృద్ధి చెందింది. ఈ పాఠశాలలో ఇఫ్లూ యూనివర్సిటీ ద్వారా విద్యార్థులకు ఇంగ్లిష్‌తో పాటు ఫ్రెంచ్, స్పానిష్ భాషలను నేర్పిస్తారు.అన్ని రకాల పోటీ పరీక్షల్లో ఇందిరానగర్ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్నారు.



ఇందిరానగర్ పాఠశాలలో ఆరోతరగతిలో సీటు కోసం వేచి ఉన్న విద్యార్థుల తల్లిదండ్రులు

## తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్ ఎంపిక పోస్టర్ ఆవిష్కరణ



తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్ ఎంపిక పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య

సంగారెడ్డి కలెక్టరేట్, జూన్ 16: తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశాలకు బాలబాలికల ఎంపిక చేపట్టనున్నట్లు సంగారెడ్డి కలెక్టర్ పి ప్రావీణ్య తెలిపారు. సోమవారం సంగారెడ్డి కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్ ఎంపిక పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్పోర్ట్స్ స్కూళ్లలో నాలుగో తరగతి ప్రవేశాల కోసం ఎంపికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. . హకీంపేటలో బాలురకు 20 సీట్లు, బాలికలకు 20 సీట్లు, కరీంనగర్‌లో బాలురకు 20 సీట్లు, బాలికలకు 20 సీట్లు, ఆదిలాబాద్‌లో బాలురకు 20 సీట్లు, బాలికలకు 20 సీట్లు, మొత్తం 120 సీట్ల భర్తీ కోసం ఎంపిక జరుగుతుందన్నారు. ఈ నెల 16 నుంచి 19వరకు మండల స్థాయిలో, ఈ నెల 25, 26వ తేదీల్లో ఉదయం తొమ్మిది గంటల నుంచి సంగారెడ్డిలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో జిల్లా స్థాయి ఎంపిక ప్రక్రియ ఉంటుందన్నారు. జూలై 3,4వ తేదీల్లో హకీంపేటలోని క్రీడా పాఠశాలలో రాష్ట్ర స్థాయి ఎంపిక పోటీలు నిర్వహించి బాలురు 20 మంది, బాలికలు 20 మందిని ఎంపిక చేస్తారని పేర్కొన్నారు. నాలుగో తరగతి ప్ర వేశాల కోసం 2016 సెప్టెంబర్ 1 నుంచి 2017 ఆగస్టు 31లోపు విద్యార్థులు జన్మించి ఉండాలన్నారు. సంబంధిత ధ్రువపత్రాలతో ఎంపిక పోటీలకు హాజరు కావాలని ఆమె కోరారు. రిజిస్ట్రేషన్ కోసం tqss.telangana.gov.in లో వివరాలు నమోదు చేసుకోవచ్చన్నారు. వివరాలకు సెల్: 7981798 957 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

## పీఎఫ్ కార్యాలయం ఎదుట పెన్షన్‌దారుల నిరసన

సిద్దిపేట అర్బన్, జూన్ 16 : పెన్షన్ విడుదలై మూడు నెలలు గడుస్తున్నా సిద్దిపేట పీఎఫ్ కార్యాలయ అధికారులు పెన్షన్ ఇప్పించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం సిద్దిపేట జిల్లా సిద్దిపేట పట్టణంలోని పీఎఫ్ కార్యాలయం ఎదుట వారు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 2014 సెప్టెంబర్ తర్వాత హయ్యర్ పెన్షన్ అనేది అమల్లోకి వచ్చిందని, ఇందు కోసం దరఖాస్తు చేసుకొని డీడీ కట్టిన తర్వాత హైదరాబాద్ కార్యాలయం నుంచి పెన్షన్ విడుదలై మూడు నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు ఇవ్వడం లేదన్నారు. గతంలో 70 మందికి పైగా పెన్షన్‌దారులకు అప్పటి కమిషనర్ ఎలాంటి ఆటంకం లేకుండా పెన్షన్ విడుదల చేశారని, ప్రస్తుతం 26 మందికి పెన్షన్ విడుదల చేయకుండా అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు.

సిద్దిపేట పీఎఫ్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులు



## తుట్టెలు పట్టిన సన్నబియ్యం

- పెదవి విరుస్తున్న సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం ధర్మారెడ్డిపల్లి లబ్ధిదారులు



సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం ధర్మారెడ్డిపల్లిలోని రేషన్ దుకాణంలో తుట్టెలు పట్టిన బియ్యం బస్తాలు (ఇన్‌సెట్లో) తుట్టెలు పట్టిన బియ్యం

గజ్వేల్, జూన్ 16: ప్రభుత్వం ప్రతి నెలా పంపిణీ చేసే రేషన్ బియ్యాన్ని ఈ నెల ఒకేసారి మూడు నెలలకు సంబంధించి లబ్ధిదారులకు పంపిణీ చేస్తుంది. పౌర సరఫరాలశాఖ ద్వారా రేషన్ దుకాణాలకు సరఫరా చేసిన బియ్యంలో ఎక్కువ శాతం నూకలు ఉండడంతో లబ్ధిదారులు పెదవి విరుస్తున్నారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం ధర్మారెడ్డిపల్లిలో 570 రేషన్‌కార్డులు ఉన్నాయి. అయితే గ్రామానికి చెందిన డీలర్ లక్ష్మారెడ్డి రేషన్ దుకాణానికి అధికారులు మొదటి విడతలో 150 క్వింటాళ్ల సన్న బియ్యం పంపించారు. వాటిలో చాలా వరకు బియ్యం బస్తాల్లో తుట్టెలు పట్టి ఉండడంతో పాటు నూకలతో కూడిన సన్న బియ్యం రావడంతో లబ్ధిదారులు ఆ బియ్యాన్ని తీసుకునేందుకు ఆసక్తి చూపడం లేదు. సుమారు 15 తుట్టెలు, నూకలతో కూడిన బియ్యం బస్తాలు వచ్చాయి. ఇంకా 80 బస్తాల వరకు పంపిణీ చేయాల్సి ఉండగా అందులో కూడా ఇలాంటి బస్తాలు ఉండొచ్చని రేషన్ డీలర్ తెలిపారు. ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా మూడు నెలల బియ్యాన్ని ఒకేసారి పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటుంది. దీంతో రేషన్ డీలర్లు పంపిణీ చేసే సమయంలో ఇబ్బందులు పడుతుండగా లబ్ధిదారులు గంటల తరబడి దుకాణాల వద్ద వేచి ఉంటున్నారు.

